## క్లుప్తంగా

### శ్రీకృష్ణునికి విశేష పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

రాజాం: పట్టణంలోని పాలకొండ రోడ్డులో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక బొద్దాం కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి నవరాత్రి ఉత్సవాలు అయిదోరోజు గురువారం వైభవంగా జరిగాయి. శ్రీకృష్ణ పరమాత్ముడికి రాజాం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం పలువురు వక్తలు ప్రవచనాలు చెప్పి, భగవద్గీత పారాయణం చేశారు.బొద్దాం ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు రామినాయుడు, మోహనరావు, గణపతి, రామకృష్ణ, కృష్ణారావు, అప్పలనరసయ్య, పారంనాయుడు, భాస్కరరావు, సూరపునాయుడు, అప్పలరాజు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీ అయిన ఉపాధ్యాయులతో విద్యార్థులు

తెర్లాం: డి.గదబవలస ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల వేరే పాఠశాలలకు బదిలీ అయిన ఉపాధ్యాయులు బి.విజయకుమార్, జె.రమేష్, ఉపాధ్యాయినులు బి.సుభాషిణి, ఎస్.శ్రీలతను గ్రామస్తులు, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఘనంగా సన్మానించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు చేసిన కృషి ప్రశంసనీయమని గ్రామస్తులు అన్నారు.

### విద్యార్థులకు నగదు పురస్కారం



ఉత్తమవిద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేస్తున్న హెచ్ఎం సత్యనారాయణ

బాడంగి: స్థానిక ఉన్నత పాఠశాలలో గత విద్యాసంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు దాతల సహకారంలో హెచ్ఎం డి.సత్యనారాయణ గురువారం నగదు పురస్కారాలు అందజేశారు. హెచ్ఎం మాట్లాడుతూ స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ఉత్తమ విద్యార్థులకు అందించాలని రూ.27,500 నగదు సహాయం చేశారని చెప్పారు. ఈ డబ్బులను పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి అందించామని పేర్కొన్నారు. ప్రత్యేకటీచర్ ఈశ్వరరావు ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

### వృద్ధులకు వైద్యపరీక్షలు




వృద్ధులకు వైద్యతనిఖీలు చేస్తున్న వైద్య సిబ్బంది

రాజాం సిటీ: జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా పట్టణంలో కొండంపేట వద్ద ఉన్న అనాథ వృద్ధాశ్రమంలో స్థానిక రోటరీక్లబ్ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు ఆదర్శనగర్ అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి యు.కిరణ్‌కుమార్ వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈసందర్భంగా రోటరీక్లబ్ అధ్యక్షుడు గట్టి పాపారావు మాట్లాడుతూ వృద్ధాప్యం సహజప్రక్రియ అయినప్పటికీ జాగ్రత్తలు పాటించడం, నడక, యోగా, వ్యాయామం వంటివి చేయడం ద్వారా ఆరోగ్యకర,ఆనందకరమైన జీవనం గడపవచ్చని అన్నారు. రోటరీక్లబ్ కార్యదర్శి ఎస్.వసంతరావు, సభ్యులు ఆకిరి రామారావు, మక్క అప్పలనాయుడు, కొత్తా సాయిప్రశాంత్ కుమార్, నీలకంఠేశ్వరయాదవ్, ఆరోగ్య కార్యకర్త భారతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

### మెనూ పాటించాలి



మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో మెనూ పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, నిర్వాహకులు మెనూ పాటించకుంటే సహించేది లేదని ఎంఈఓ త్రినాథరావు హెచ్చరించారు. మండలంలోని కుమ్మరిపేట ఫౌండేషన్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను గురువారం ఆయన పరిశీలించారు. వంటకాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తంచేశారు. రోజూ ఇదే విధంగా మెనూ ప్రకారం, రుచి, శుచికరంగా భోజనాలు వండి పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని ఉపాధ్యాయులను కోరారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యం.. పాడి రైతులకు శాపం

- పశువైద్యశాలల్లో అరకొరగా మందులు
- ప్రైవేటు దుకాణాలను ఆశ్రయిస్తున్న పాడిరైతులు
- పశుపోషకులపై అదనపు ఆర్థిక భారం

రామభద్రపురం: ప్రభుత్వ నిర్లక్ష్యం పాడిరైతులు, మూగజీవాల పెంపకందారులకు శాపంగా మారుతోంది. బొబ్బిలి నియోజకవర్గంలోని పశువైద్యశాలల్లో పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో లేకపోవడంతో పాడిరైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిబంధనల ప్రకారం పశువైద్యశాలల్లో సుమారు 150 రకాల మందులు అందుబాటులో ఉండాలి, కానీ సగానికి పైగా మందులు లేవు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చాలా వరకు మందుల సరఫరా చేయలేదని తెలుస్తోంది. బొబ్బిలి నియోజకవర్గంలోని బొబ్బిలి,రామభద్రపురం,తెర్లాం,బాడంగి మండలాల్లో 10 వరకు పశు వైద్య శాలలు ఉన్నాయి. వీటి పరిధిలో ఆవులు 64,357,గేదెలు 9,080, గొర్రెలు 78,260, మేకలు 24,309 ఉన్నాయి. పశువులు, మూగజీవాలకు సీజనల్ వ్యాధులతో పాటు ఏఆరోగ్య సమస్య వచ్చి పశువైద్యశాలలకు తీసుకెళ్లినా అక్కడ పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉండడం లేదు. పలు రకాల మందులను ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేసుకోవాలని పశువైద్యాధికారులు చీటీ రాస్తున్నారని పాడిరైతులు చెబుతున్నారు.గతంలో ఉచి తంగా అందిన మందులనే నేడు ప్రభుత్వ నిర్వాహకం వల్ల ప్రైవేటు దుకాణాల్లో వందల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువుల్లో జ్వరాలు,పారుడు, మేత తినకపోవడం,నులిపురుగులు,గర్భదారణ సమస్యలు తరచూ వస్తుంటా యి. వీటికి సంబంధించిన మందులు పశువైద్యశాలల్లో లేకపోవడంతో పాడిరైతులు బయట కొనుగోలు చేసుకుంటున్నారు.

**ఆర్ఎస్‌కేల ద్వారా అందని సేవలు**

రైతు సేవా కేంద్రా(ఆర్ఎస్‌కే)ల ద్వారా పాడి రైతులకు కనీస సేవలు అందడం లేదు. ఆర్ఎస్‌కేలకు కూడా మందుల సరఫరా నిలిచిపోయింది. అలాగే ఏడెనిమిది నెలలుగా రాయితీపై అందించే దాణా సరఫరా కావడం లేదు. బొబ్బిలి మండలంలో 18,రామభద్రపురం మండలంలో 16, బాడంగి మండలంలో 17,తెర్లాం మండలంలో 18 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి.అన్ని కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాడి రైతులకు అవసరమైన సేవలన్నీ రైతు సేవా కేంద్రాల్లో అందేవి.



పశువైద్యాధికారి లేని కొట్టక్కి పశువైద్యశాల

**కొట్టక్కిలో ఖాళీగా పశువైద్యాధికారి పోస్టు**

రామభద్రపురం మండలంలోని కొట్టక్కి పశువైద్యశాలలో రెండు నెలలుగా పశువైద్యుడు లేకపోవడంతో ఈ వైద్యశాల పరిధిలోని కొట్టక్కితో పాటు తారాపురం,కొండకెంగువ,జన్నివలస, మిర్తివలస తదితర గ్రామాల్లోని పశువులు, మూగజీవాలకు సక్రమంగా వైద్యసేవలందడం లేదు. ఇక్కడ పనిచేసే వైద్యాధికారిని జూన్‌లో పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ చేశారు.ఇప్పటి వరకు ఆయన స్థానంలో కొత్త పశువైద్యాధికారి రాలేదు. ఆర్ఎస్‌కేలో పనిచేస్తున్న వెటర్నరీ అసిస్టెంటే ఇక్కడ వైద్య సేవలందించాల్సి వస్తోంది. ఈ ఆస్పత్రి పరిధిలో సుమారు 2 వేల వరకు పశువులు ఉన్నాయి.

**పశువైద్యాధికారిని నియమించాలి**



కొట్టక్కి పశువైద్యశాలకు పశువైద్యాధికారి లేకపోవడం వల్ల పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.పశువులకు సరైన వైద్య సేవలందడం లేదు. ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో లేవు. గత్యంతరం లేక పలురకాల మందులను బయట కొనుగోలు చేసుకుంటున్నాం. పశువైద్యశాలకు వైద్యాధికారిని నియమించడంతో పాటు పూర్తి స్థాయిలో మందులు సరఫరా చేయాలి.

– ముల్లు సాగర్ సాయి,పాడిరైతు,కొట్టక్కి

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**



కొట్టక్కిలో పశువైద్యాధికారి లేక పాడి రైతులు ఇబ్బందులుపడుతున్నది వాస్తవమే.అయితే ఇక్కడ పనిచేసిన పశువైద్యాధికారిని పార్వతీపురం మన్యం జిల్లా బదిలీపై వెళ్లారు. అదే జిల్లా నుంచి పశువైద్యాధికారికి ఇక్కడకు బదిలీపై రావాల్సి ఉంది.అయితే అతనిని ఇప్పటికీ రిలీవ్ చేయకపోవడంతో రాలేదు.ఈ విషయం ఉన్నతాదికారుల దృష్టికి తీసుకెళ్లాం.కొద్ది రోజుల్లో నియమిస్తారు.అలాగే ఆర్ఎస్‌కేలలో మందుల కొరత ఉన్న మాట వాస్తవమే.పశువైద్యశాలలకు వారం రోజుల్లో మందులు సరఫరా కానున్నాయి. వచ్చిన వెంటనే ఆర్ఎస్‌కేలకూ సరఫరా చేస్తాం.

– ఎల్ విష్ణు,పశుసంవర్ధకశాఖ ఏడీ, బొబ్బిలి

# అంగన్‌వాడీల ఆందోళన




బాడంగి: బాడంగి మెయిన్‌రోడ్డులో గాంధీజి విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వంగర, రేగిడి, తెర్లాం,బాడంగి, బొబ్బిలి మండల కేంద్రాల్లో ఆయా మండలాల్లోని పలు సెక్టార్ల పరిధి అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు గురువారం ఆందోళన చేశారు. అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ నాయకులు మాట్లాడుతూ వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని, ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు వర్తించేలా జీఓ జారీ చేయాలని కోరారు. గ్రాట్యుటీ వర్తింపచేయాలని, ఉద్యోగవిరమణ అనంతరం పెన్షన్ సదుపాయం కల్పించాలని, ఎటువంటి షరతులు లేకుండా మినీఅంగన్‌వాడీ వర్కర్లను మెయిన్ అంగన్‌వాడీ వర్కర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. పోషణట్రాకర్, బాలసంజీవిని, తదితర యాప్‌లకు ఫోన్లు సపోర్టు చేయడం లేదని, కొత్త ఫోన్‌లు అందించాలని కోరారు. వంగర్ బస్టాండ్ ఆవరణలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి, రేగిడి మండలంలో ఉంగరాడమెట్ట వద్ద అంబేడ్కర్ విగ్రహానికి, బాడంగి మెయిన్ రోడ్డులో గాంధీజి విగ్రహానికి, తెర్లాంలో ఉప తహసీల్దార్ జి.సత్యనారాయణకు, బొబ్బిలిలో తహసీల్దార్ శ్రీనుకు అంగన్‌వాడీ సిబ్బంది వినతిపత్రాలు అందజేశారు. సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

– వంగర/రేగిడి/తెర్లాం/బాడంగి/బొబ్బిలిరూరల్



వంగర: వంగరలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



రేగిడి: ఉంగరాడమెట్ట వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు



తెర్లాం: ఉప తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



బొబ్బిలిరూరల్: తహసీల్దార్ శ్రీనుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

# నమ్మక ద్రోహం చంద్రబాబు నైజం

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: నమ్మక ద్రోహం, మోసం చేయడం, మాటతప్పడం చంద్రబాబునాయుడి నైజమని, ఇచ్చిన హామీలేవీ అమలు చేయరని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. బొబ్బిలి మున్సిపాలిటీలోని 30వ వార్డులో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం గురువారం నిర్వహించారు. వార్డులో ఇంటింటికి వెళ్లి కూటమి ఎన్నికల మేనిఫెస్టోను చూపించి, వాటిలో పేర్కొన్న హామీలను చంద్రబాబు అమలు చేశారా అని ప్రజలను శంబంగి ప్రశ్నించారు. ఎన్నికల హామీలకు ఎగనామం పెట్టి కూటమి ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా శంబంగి మాట్లాడుతూ పెన్షన్ మొత్తాన్ని పెంచామని చెబుతున్న ప్రభుత్వం తాజాగా లక్షలాది మంది దివ్యాంగులకు పింఛన్ నిలిపివేస్తున్నట్లు నోటీసులు జారీ చేసింద న్నారు. ఎన్నికల్లో చంద్రబాబు సూపర్ సిక్స్‌తో పాటు వందల హామీలు ఇచ్చారని, ఇప్పుడు వాటిని నెరవేర్చలేక చేతులెత్తేస్తు న్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.వి.మురళీకృష్ణ, వార్డు ఇన్‌చార్జ్ రెడ్డి శివున్నాయుడు పాల్గొన్నారు.



చంద్రబాబు మోసాలను మహిళకు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

## యూరియా కొరతతో ఇబ్బందులు

బొబ్బిలి: యూరియా కొరత వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం తక్షణమే రైతు సేవా కేంద్రాల్లో యూరియా సరఫరా చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. పట్టణంలోని సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వరినాట్లు దాదాపు పూర్తయ్యాయని, పంటకు ఈ సమయంలో యూరియా ఎరువు వేయాల్సి ఉందన్నారు. కానీ రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా పూర్తిస్థాయిలో సరఫరా కావడం లేదని అన్నారు. గత ప్రభుత్వంలో నాట్లు పడకముందే యూరియా, డీఏపీ వంటి ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో పంపిణీకి సిద్ధం చేసేవారని, ప్రస్తుతం రైతులు ఎరువుల కోసం ప్రైవేటు దుకాణాలకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి తలెత్తిందని విమర్శించారు. డీఏపీ, గుళికలు కొంటేనే యూరియా ఇస్తామని ప్రైవేటు దుకాణాల నిర్వాహకులు షరతులు పెడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే యూరి యాను అందుబాటులోకి తేవాలని, లేకుంటే రైతుల పక్షాన ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలం

## సచివాలయంలో తనిఖీలు

రేగిడి: మండలంలోని బూరాడ గ్రామ సచివాలయంలో తహసీల్దార్ కృష్ణలత గురువారం తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సక్రమంగా సేవలందించాలని సూచించారు.

## ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం

బొబ్బిలి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలలు గడుస్తున్నా రైతులకు యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు విమర్శించారు. పట్టణంలోని రైతు సంక్షేమ సంఘ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడతూ గత ప్రభుత్వంలో రైతు భరోసాకేంద్రాల ద్వారా సకాలంలో యూరియా సరఫరా చేసేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం చాలా రైతు సేవాకేంద్రాల్లో యూరియా లేదని, రైతులు ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తోందని అన్నారు. రైతు సేవా కేంద్రాల్లో నిల్వలు ఉన్న చోట రాజకీయ నాయకుల సిఫార్సులు ఉన్న దళారులకే యూరియా అందుతోందని, అసలైన రైతులు దగా పడుతున్నారని ఆరోపించారు. ప్రైవేటు దుకాణాల్లో వ్యాపారులు యూరియా బస్తాను రూ.400కు విక్రయిస్తున్నారని, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించడంలో ప్రభుత్వం,అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. .ఇప్పటికైనా రైతులకు యూరియా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.



మాట్లాడుతున్న వేమిరెడ్డి లక్ష్మునాయుడు

## విద్యార్థినులకు సత్కారం

రాజాం సిటీ: ప్రతీ విద్యార్థి తమకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకో వాలని ప్రభావతి జాగృతి ట్రస్టు అధ్యక్షులు, రొటేరియన్ ఎస్.వసంతరావు అన్నారు. మండలంలోని పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి జాతీయ ఉపకార వేతనాల(ఎన్ఎంఎంఎస్)కు ఎంపికైన ఇద్దరు విద్యార్థినులను గురువారం సత్కరించారు. హెచ్ఎం బి.పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినులను సత్కరిస్తున్న వసంతరావు, తదితరులు

## ఐటీఐలలో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

బొబ్బిలి: ప్రభుత్వ ఐటీఐలలో వివిధ ట్రేడుల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్థానిక ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.పదోతరగతి ఉత్తీర్ణులైన వారంతా అర్హులేనని, ఆసక్తి ఉన్న వారు ఈనెల 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.ఎంపికై న అభ్యర్థులు బొబ్బిలి,రాజాం,విజయనగరం ఐటీఐలలో ఎక్కడైనా చేరేందుకు అవకాశం ఉందని తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, సందేహాలుంటే బొబ్బిలి ఐటీఐలో సంప్రదించాలని సూచించారు.

# దివ్యాంగుల పింఛన్ల తొలగింపు అన్యాయం

- మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు పింఛన్ తొలగించడం చాలా అన్యాయమని, పింఛనే ఆధారంగా జీవిస్తున్న దివ్యాం గుల పొట్టపై కొట్టిందని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు పింఛన్ తొలగిస్తూ వారికి తీరని ద్రోహం చేసిందని, పెన్షనే ఆధారంగా జీవిస్తున్న కుటుంబాల పరిస్థితి ఏం కావాలని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా ఒక్కరికీ పింఛన్ ఇవ్వకపోగా, ఎన్నో ఏళ్లుగా పింఛన్ అందు కుంటున్నవారికి నిలిపివేయడం అరాచకమన్నారు. దివ్యాంగ పింఛన్ల తొలగింపులకు సంబంధించి వైద్యులకు టార్గెట్ ఇవ్వడం ద్వారా వారు దివ్యాంగుల వైకల్యం శాతాన్ని తగ్గించారని, ఇది నీచమైన చర్యగా అభివర్ణించారు. గ్రామాల్లో దివ్యాంగులంతా బోరున విలపిస్తున్నారని అన్నారు. అర్హులందరికీ పింఛన్లను పునరుద్ధరించాలని, లేకుంటే వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.వి.మురళీకృష్ణ, నాయకులు బి.సాయికృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

**దివ్యాంగుల జీవితాలతో ఆటలు**

రామభద్రపురం: పింఛన్ నిలిపివేస్తూ దివ్యాంగుల జీవితాలతో కూటమి ప్రభుత్వం ఆడుకుంటోందని సీపీఎం నాయకుడు బలస శ్రీనివాసరావు, వైఎస్ఎంపీపీ ప్రతినిధి పెంకి శేఖర్ విమర్శించారు. పింఛన్ నిలిపివేస్తున్నట్లు నోటీసులు అందు కున్న మండలానికి చెందిన పలువురు దివ్యాంగులతో కలిసి స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో ఇన్‌చార్జ్ ఎంపీడీ ఓ సీహెచ్.సన్యాసిరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దశాబ్దకాలంగా పింఛన్ అందుకుంటున్న దివ్యాంగులకు వైకల్యం శాతం తక్కువ ఉందని చెప్పి ఇప్పుడు పింఛన్ నిలిపివేయడం దారుణమని అన్నారు. వైకల్యంతో అవస్థలు పడుతున్నారనే కనికరం లేకుండా ప్రభుత్వం దివ్యాంగులను వేధిస్తోందని మండిపడ్డారు. చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్‌తో పాటు వందల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, వాటిని అమలు చేయడం దేవుడెరుగు కానీ ఉన్నవాటికి ఎసరు పెడుతున్నారన్నారు. బాబు పన్నాగంలో తొలుత దివ్యాంగులు బలవుతున్నారన్నారు. పింఛన్ నిలిపేస్తే వారి కుటుంబ పోషణ ఎలా అని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పింఛన్ల తొలగింపు ప్రక్రియను ఆపాలని ప్రభుత్వాన్ని కోరారు.

**మాపై ఎందుకీ కక్ష..**

బొబ్బిలిరూరల్: ఎన్నో ఏళ్లుగా పింఛన్ డబ్బులతోనే జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు పింఛన్ నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం నోటీసు లు అందించిందని, ప్రభుత్వానికి మాపై ఎందుకీ కక్ష అని పలువురు దివ్యాంగులు వాపోయారు.మండలంలో 1,112 మంది దివ్యాం గ పింఛన్‌దారుల్లో 398కి పింఛన్ నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం నోటీసులు జారీ చేయడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. పలుగ్రామాలకు చెందిన దివ్యాంగులు ఆయా గ్రామాల సర్పంచ్‌లతో కలిసి గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని, తమ పింఛన్లను పునరుద్ధరించాలని కోరుతూ ఎంపీడీఓ రవికుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు.



బొబ్బిలి: విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి



రామభద్రపురం: పింఛన్ల తొలగింపు ఆపాలని ఎంపీడీఓ సన్యాసిరావుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకుడు శ్రీనివాసరావు, దివ్యాంగులు



బొబ్బిలిరూరల్: పింఛన్లను పునరుద్ధరించాలని సర్పంచ్‌లతో కలిసి ఎంపీడీఓ రవికుమార్‌కు వినతిపత్ర ం అందజేస్తున్న దివ్యాంగులు

## మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

బొబ్బిలి: పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక చవితి ఉత్సవాల్లో అంతా మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని పట్టణంలోని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయానికి చెందిన బీకే రాజేశ్వరి అక్కయ్య సూచించారు. స్థానిక బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో పట్టణ ప్రజలకు గురువారం మట్టివినాయ ప్రతిమలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయనగరం స్పార్క్ సొసైటి సౌజన్యంతో మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు ఉచితంగా అందజేస్తున్నామని చెప్పారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలు పర్యావరణానికి హానికరమన్నారు.

## వినాయక ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి

రాజాం సిటీ: వినాయకచవితి ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక టౌన్ సర్కిల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండపాలు ఏర్పాటు చేయాలనుకునే వారు ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాలని చెప్పారు. ఇందుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన పని లేదన్నారు. రహదారుల పక్కన మండపాలు ఏర్పాటుచేసి ట్రాఫిక్‌కు ఇబ్బం దులు కలిగించవద్దని, అలాగే విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సంబంధిత శాఖ ఆదేశాలు పొందాలన్నారు. రోజూ విగ్రహం వద్ద రాత్రి వేళల్లో ఎవరో ఒకరు ఉండేలా కమిటీ సభ్యులు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొ న్నారు. పెద్దపెద్ద విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే మంచిదన్నారు. విగ్రహం ఎత్తు, నిమజ్జనం ఎన్నిరోజులకు చేస్తారు, అనుపోత్సవం ఎక్కడ చేస్తారన్న విషయాలను పోలీసులకు తెలియజేయాలన్నారు. ఊరేగింపుల్లో డీజేలు పెట్టవద్దని సూచించారు.



రాజాం సిటీ: మీడియాతో మాట్లాడుతున్న సీఐ అశోక్‌కుమార్

**అనుమతి తప్పనిసరి**

సంతకవిటి: వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి అని ఎస్ఐ ఆర్.గోపాలరావు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో మండపాలు ఏర్పాటు చేయదలచిన వారు పోలీస్, అగ్నిమాపకశాఖ, స్థల యజమాని పర్మిషన్ తీసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో గణేష్ ఉత్సవ్ డాట్ కామ్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. మండపాల వద్ద డీజేలు ఏర్పాటు చేయకూడదని అన్నారు.

## సవాళ్లను అధిగమిస్తేనే భవిష్యత్

రాజాం సిటీ: సవాళ్లను అధిగవించే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని హైదరాబాద్‌కు చెందిన ఎస్ఐఓఆర్ఓపీ ఫ్యాషన్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ సీఈఓ, డిజిటల్ మార్కెటింగ్ లీడ్ దన్నాన జయదీపిక, వేగుచుక్క ప్రింటర్స్, జ్యూయెలరీ రాజాం ఎండీ జి.హేమంత్ కుమార్ అన్నారు. స్థానిక జీఎంఆర్ ఐటీలో ప్రపంచ వ్యవస్థాపక దినోత్సవం (డబ్ల్యూఈడీ) గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా ర్థులు కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి వ్యవస్థాపకులుగా మారడానికి సవాళ్లను అధిగమించాల్సి ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే కష్టపడి పనిచేసే స్వభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పరిశ్రమలు స్థాపించేందుకు నిర్మాణాత్మక ప్రణాళిక లు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. జీఎంఆర్ వీఎఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.ఎల్.వి.ఆర్.ఎస్.వి.ప్రసాద్, ఎం.శ్రీనివాస రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎస్ఐఓఆర్ఓపీ ఫ్యాషన్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ సీఈఓ జయదీపిక